క్లుప్తంగా

పిఠాపురం డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని పలు కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకూ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుభాషిణి తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్స్, అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, జువాలజీ హానర్స్ గ్రూపుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. జాయినింగ్‌కు వచ్చే విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు మూడు జతల జెరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. పిఠాపురం, పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

'ఉప్పలూరి' జయంతి వేడుకలకు ఏర్పాట్లు

పిఠాపురం: కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఉప్పలూరి సుబ్బారావు జయంతి వేడుకలను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నారాయణమూర్తి తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆదివారం ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేబ్రోలు పంచాయతీ కార్మికులు కొకంటి తాతీలు, గుడాల సత్యనారాయణ, బోడపాటి ముత్తయ్య, దరిసె చిన్న, దొండపాటి నూకరాజు, నాగ సత్తులు, మహాలక్ష్మి, దొండపాటి తుక్కియ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పాముల హల్‌చల్



కిటికీ నుంచి తరగతి గదిలోకి వెళ్తున్న పాము

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం పాములు హల్‌చల్ చేశాయి. నాడు–నేడు పనులలో భాగంగా పాఠశాలలో ఉంచిన ఐరెన్ ఊసలు తీసేందుకు కూలీలు ప్రయత్నించగా కొన్ని పాములు బయటకు వచ్చాయి. వాటిలో కొన్ని చెల్లాచెదరైపోగా ఒకటి కిటికీ గుండా తరగతి గదిలోకి ప్రవేశించింది. దానిని గమనించిన ఒక కుక్క దానిని కొరికి చంపేసింది.

ధ్యానంతో ప్రయోజనాలెన్నో

కాకినాడ రూరల్: శ్వాసపై ధ్యాస ఉంచి ధ్యానం చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని శిక్షకురాలు తటవర్తి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శ్రీ విశ్వశాంతి పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో రమణయ్యపేట శాంతి ఆశ్రమంలో ధ్యానం, ఆత్మ జ్ఞానంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ సమస్యలకు, బలహీనతలకు, దుఃఖాల నివారణకు ధ్యానం ఒక్కటే శరణ్యమన్నారు. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వలన మనలో కలిగే ఉద్రిక్తతలను నివారించవచ్చన్నారు. మానసిక ఆందోళన నుంచి విముక్తి కలిగించి ప్రశాంతతను ఇచ్చేది ధ్యానం మాత్రమే అన్నారు. కార్యక్రమానికి అడబాల స్వర్ణ అధ్యక్షత వహించగా వేణు, మల్లిక, లలిత, సుభాషిని, రాధ, కాశీ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ శక్తికి ఆలంబన భాగవత పఠనం

బోట్‌క్లబ్: సంపూర్ణ శక్తి సృజనకు భాగవత పఠనం ఆలంభనని ప్రముఖ సాహితీవేత్త కాశీభొట్ల సత్యనారాయణ అన్నారు. స్థానిక రామారావుపేటలోని వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో ఆదివారం భాగవత ధారావాహికలు ప్రారంభించాయి. ఈ ప్రసంగాలు ఈ నెల 23 జరుగుతాయని ప్రచారసభ సంయుక్త కార్యదర్శి చింతపల్లి సుబ్బారావు తెలిపారు. ప్రచార సభ ఉపాధ్యక్షులు సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, సభ్యులు గొట్టుముక్కల వేంకట సత్య నరసింహశాస్త్రి, కాకరపర్తి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్‌లోని శిల్పారామంలో విద్యార్థులు ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. కాకినాడకు చెందిన బాలభవన్ విద్యార్థినులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. విశ్రాంత ఇంజినీర్ లక్ష్మణరెడ్డి, ఏఓ ప్రకాష్, బాలభవన్ పర్యవేక్షకులు శారద తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో పారాయణ పఠనం

ఏలేశ్వరం: స్థానిక మార్కెట్ వీధిలోని రూపులమ్మ అమ్మవారి ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పలు పారాయణాలు పఠించారు. విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శివ స్తోత్రాలు, లలితా సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి కటకం కిరిటీ, సంఘ మహిళా సభ్యులు పాబోలు దేవి, మల్లేశ్వరి, ఇందిరా, పద్మజ, రమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో పెద్దాపురం మరిదమ్మ అమ్మవారు



ప్రత్యేకాలంకరణలో పురుహూతికా అమ్మవారు



దుర్గాడ రామలింగేశ్వర ఆలయంలో పూలమాలికల్లో అమ్మవారు



బాలా త్రిపురసుందరిగా కాండ్రకోట నూకాలమ్మవారు

దుర్గాదేవీ నమోస్తుతే..

- అట్టహాసంగా శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

పిఠాపురం: దేవీశరన్నవరాత్ర ఉత్సవాలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠానికి అధిష్టాన దేవతైన పురూహూతికా అమ్మవారికి శతచండీ యాగ సంకల్పం, చండీపారాయణ, మహాగణపతి, దత్తాత్రేయ, శ్రీకుక్కుటేశ్వరస్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురూహూతికా అమ్మవారికి శ్రీచక్ర నవావరణార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పాదగయ క్షేత్రంలోని దసరా ప్రారంభ వేడుకల్లో ఎమ్మెల్యే పెండెం దొరబాబు దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దొరబాబుతో అమ్మవారి కలశ ప్రతిష్ఠ చేయించిన వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. గొల్లప్రోలు, పిఠాపురం కనకదుర్గమ్మ ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తెలిపారు.



గొల్లప్రోలు దుర్గాదేవి ఆలయంలో గరగనెత్తుకున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పోటెత్తిన భవానీ భక్తులు

పాదగయ క్షేత్రానికి ఆదివారం భవానీ దీక్షాపరులు పోటెత్తారు. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ అధికారులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

శైలపుత్రిగా అపర్ణాదేవి

శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి అమ్మవారు శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాడ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు.

కొత్తపల్లి: మండలంలో దేవీనవరాత్ర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో దుర్గమాత విగ్రహాలను ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే వందలాది మంది భవానీ దీక్షలు స్వీకరించడంతో పల్లెలు భవానీ భక్తులలో కళకళాడుతున్నాయి. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పాదగయ క్షేత్రంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భవానీ భక్తులు



పాదగయ క్షేత్రంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

శుభకరం.. శరన్నవరాత్ర వేడుక

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాలు పట్టణం, మండలంలోని ప్రతి గ్రామంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, ఆచార్యుల రక్షాబంధనము, కలశ స్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తసంఘం నాయకుడు బిక్కిన సాయి దీక్షా వస్త్రాలను అందజేశారు. ఆలయంలో నిర్వహించిన హోమంలో ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, బొందలపు వెంకటరమణ, భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయి పాల్గొన్నారు. అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధి రాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించి దర్శనాలు కల్పించారు.

అమ్మవార్ల ఆలయాల్లో భక్తులు పూజలు...

పట్టణ పరిధిలోని అయోధ్యరామపురంలోని కనకదుర్గ ఆలయాలలో ఆలయ ధర్మకర్త పైన్ని రామకృష్ణ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు, సత్తెమ్మ తల్లి ఆలయంలోను బడేలమ్మ చెరువు వద్ద నవదుర్గ ఆలయంలోను, బ్రౌన్‌పేటలోని కనకదుర్గ ఆలయం లోను, బల్లమార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మందిరంలోను, నీలమ్మ చెరువు వద్ద ఉన్న సత్తెమ్మతల్లి ఆలయం వద్ద గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన మందిరంలోను రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మందిరంలోను భక్తులు పూజలు చేశారు. నూకాలమ్మ ఆలయంలో అమ్మవారిని 70 కేజీల రంగు బియ్యం ప్లాస్టిక్ కవర్లలో వేసి అలంకరించారు. గణపతినగరంలోని కనకదుర్గ మందిరంలో జీవీకే మోహన్‌రావు ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వేట్లపాలెం బేతాళస్వామి ఆలయంలో..

వేట్లపాలెం బేతాళస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఉత్సావాలను ప్రారంభించారు. 25వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయ కమిటీ నాయకులు కొండపల్లి సూరన్నచౌదరి, సున్న వెంకట్రాజు, గోలి శ్రీరామ్, గుణ్ణం సురేష్ గద్దే రాంబాబుల ఆధ్వర్యంలో గ్రామ శివారులో ఉన్న బేతాళ స్వామిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొని వచ్చి ప్రతిష్ఠ చేశారు. పీబీ దేవం శ్రీశారదా రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి ఉత్సవాలను సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ ప్రారంభించారు.



సామర్లకోట కనకదుర్గ ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు

మరిడమ్మ, నూకాలమ్మ తల్లి ఆలయాల్లో..

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే స్థానిక మరిడమ్మ తల్లి, కాండ్రకోట నూకాలమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల ఈఓలు సీహెచ్ రామ్మోహనరావు, టీవీ సూర్యనారాయణల అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవార్లు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్థానిక వర్తులవారి వీధిలో వెలసిన భువనేశ్వరి అమ్మవారిని పీఠాధిపతి చింతా గోపి శర్మ ఆధ్వర్యంలో గల్లె వెంకటరాజ రవికుమార్, వెంకటలక్ష్మి నాగ మల్లేశ్వరి దంపతులచే వైభవంగా ప్రతిష్ఠించారు. స్వర్ణకవచంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో ఈఓ ఆధ్వర్యంలో పూజలు

చేతుల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

సామర్లకోట: మెప్మా కార్యాలయంలో చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ సామర్లకోట పర్యటన సందర్భంగా మెప్మా ఆర్పీల పనితీరు అభినందనీయమని అన్నారు. సీఎం జగన్‌తోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, మరోసారి ఆయనను గెలిపించుకోవాలని, అలాగే స్థానికుడైన దవులూరి దొరబాబును సైతం ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలను బహిష్కరించాలి..

ప్రపంచ బాల్య వివాహాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెప్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ చేతుల శుభ్రత, బాల్య వివాహాలపై మహిళలో అవగాహన పెరగాలన్నారు. మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత అధ్యక్షత వహించగా కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్ర రావు, జట్ల మోహన్, పాగా సురేష్ కుమార్, పితాని కృష్ణ, ఎస్ సురేష్, కరణం రాజ్‌కుమార్, పార్టీ నాయకులు రెడ్నం దొరబాబు, నక్కా జానికిరామయ్య, చిట్టుమాని శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.



చేతుల పరిశుభ్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణ

కలాంకు చిత్రాంజలి

పెద్దాపురం: ఆరు పదుల వయసులో కళలపై ఆమెకు ఉన్న అభిమానం అంత ఇంతా కాదు.. గాంధీ జయంతి రోజున బాపూజీ బొమ్మ, వినాయక చవితి రోజున వినాయక ప్రతిమను చిత్రికరించే కళాకారిణి పట్టణానికి చెందిన కోరుకొండ మహాలక్ష్మి. కళారూపాలను తీర్చిదిద్దే ఆమె చేయి ఆదివారం దేశ 11వ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన రూపాన్ని చిత్రీకరించారు. చూపరులను ఈ చిత్రం ఆకట్టుకుంటోంది.



మహాలక్ష్మి చిత్రీకరించిన అబ్దుల్ కలామ్ చిత్రం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

శంఖవరం: జాతీయ రహదారిపై మండలంలోని కత్తిపూడి వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో మహిళ మృతి చెందింది. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కత్తిపూడి గ్రామానికి చెందిన తురుపాటి లక్ష్మి (73) బంకు సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

ధర్మ పరిరక్షణకే వెంకన్న ప్రచార రథం



జె.రామారావుపేట పమ్మిడివారివీధిలో రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

బోట్‌క్లబ్: సనాతన భారతీయ హిందూ ధర్మరక్షణలో భాగంగా సనాతన ధర్మ ప్రచార వాగ్గేయకార సంకీర్తన వాహిని సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ప్రచార రథానికి కాకినాడలో భక్తులు ఆపూర్వ స్వాగతం పలికారు. స్థానిక జగన్నాథపురం జె.రామారావుపేటలోని పమ్మిడివారి వీధిలో రామాలయం వద్ద ప్రచార రథానికి భక్తులు, మహిళలు, చిన్నారులు కలశాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధి కరుటూరి వేంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రచార రథాన్ని 2015లో కర్ణాటకలోని రాయచూర్‌లో ప్రారంభించినట్లు చెప్పారు. తిరుమల వెళ్లి శ్రీవారి దర్శించుకోలేని వారి కోసం వారి ఇంటి ముంగిటకే స్వామిని తీసుకువెళ్లడం ద్వారా భగవంతుని కరుణ అందరూ పొందాలన్నదే తన ధ్యేయమన్నారు. కాకినాడ భక్తులు కోరిక మేరకు రథాన్ని ఇక్కడి వీధుల్లో ఊరేగిస్తున్నట్లు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తుని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తుని: స్థానిక పాత బజారువీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ అన్నవరం శ్రీను స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వారం రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తామని ఈవో విశ్వనాథరాజు తెలిపారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, సామూహిక పూజలు జరుగుతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పశువులను తరలిస్తున్న ఇద్దరిపై కేసు



వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న మూగజీవాలు

కిర్లంపూడి: మూగజీవాలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. స్థానిక హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం నుంచి హైదారాబాద్‌కు 7 ఆవులు, 5 దున్నలను బొలేరో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు ఆదేశాలతో పోలీసులు కృష్ణవరం టోల్‌గేట్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. ఆవులను, దున్నలను గోకవరం మండలం కృష్ణుడిపాలెం గోశాలకు తరలించారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన వ్యాన్‌ను సీజ్ చేశారు. పోలీస్ సిబ్బంది ప్రసాద్, సుబ్బిరెడ్డి, నూకరాజు పాల్గొన్నారు.

రేపు కాకినాడలో జాబ్‌మేళా

కోటనందూరు: కాకినాడలో ఈ నెల 17న బెస్ట్ కెరీర్స్ ఇండియా ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేవీ రమణ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్, పంజాబ్ నేషనల్ బ్యాంకు, పేటీఎం, మెట్‌లైఫ్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివిన 40 సంవత్సరాలు లోపు యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ. 40 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కాకినాడలోని బెస్ట్ కెరీర్స్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91547 62596, 95152 58225 నంబర్లను సంప్రదించాలన్నారు.

కంటి వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయం

సామర్లకోట: స్థానికంగా ఒక మార్వాడీ కుటుంబం 15 ఏళ్లుగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ చంటిపిల్లల వైద్యుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చందలాడ అనంత పద్మనాభం అన్నారు. భవరాల్ డి జైన్ ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తన తండ్రి భవరాల్ డి జైన్ 2006లో ఈ శిబిరాన్ని ప్రారంభించారని ఆయన లేకపోయినా దాన్ని ఏటా కొనసాగిస్తున్నామని ఆయన కుమారుడు సుమిత్ జైన్ తెలిపారు. ఇప్పటి వరకు 4,687 మందికి కంటి పరీక్షలు చేసి, 1,650 మందికి ఆపరేషన్లు చేయించామన్నారు. కిరణ్ కంటి ఆస్పత్రి నిర్వాహణలో డాక్టర్లు తేజ, చైతన్య రోగులకు పరీక్షలు నిర్వహించారు. ప్రోగ్రామ్ మేనేజరు సత్యనారాయణ, శివగణేష్, సీనియర్ టెక్నీషియన్లు ఆశ, హేమ, మాజీ కౌన్సిలర్ కాపుగంటి పైడిరత్నం రోగులకు సేవలందించారు. 300 మందిని పరీక్షించి, 147 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు.



ఉచిత కంటి పరీక్షలు చేస్తున్న కిరణ్ కంటి ఆస్పత్రి డాక్టర్లు

పలు గ్రామాల్లో పోలీసు దాడులు

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని ఇంద్రపాలెం, కరప పోలీసులు ఆదివారం కోడి పందేలు ఆడే ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సైలు దేవసుధా, రామకృష్ణ కొవ్వూరు, రేపూరు, కొవ్వాడ, గంగనాపల్లి గ్రామాల్లో దాడులు చేసి ముందస్తుగా కోడి పందాలకు కత్తెలు కట్టే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యం, గంజాయి తాగేవారిపై దాడులు చేసి పలువురు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.



ఇంద్రపాలెం పరిధిలో దాడులు నిర్వహిస్తున్న సీఐ, ఎస్సైలు దేవసుధ, రామకృష్ణ

ఆలోచనల మార్పిడితో మేధోమథనం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కళాశాలలో నిర్వహించే వర్క్‌షాపుల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా పరస్పరం ఆలోచనలు పంచుకోవచ్చని ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్ పేర్కొన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఐడియల్ కళాశాలలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మెకోట్రానిక్స్ ఇండస్ట్రియల్ ఆటోమెషిన్ వర్క్‌షాపు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుదలతో పాటు జీవితంలో స్థిరపడే మనోధైర్యాన్ని చేకూర్చుకోవడానికి దోహదపడతాయన్నారు. మిత్సుబిషి ఎలక్ట్రిక్, బ్రుందమ్ మెకోట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమెషిన్‌లో వచ్చిన మార్పులు వివరించారు. పారిశ్రామిక 4.0 ప్రకారం పీఎల్‌సీ డెమో కిట్స్, సర్వోమోటర్స్, ల్యాడర్ ప్రోగ్రామింగ్ అంశాలను ప్రాక్టికల్‌గా విద్యార్థులచే చేయించి కంపెనీలో ఎలా ఉపయోగించాలో వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ అంజిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

గోకవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం విజయవాడ బ్లాసమ్స్ హాస్పిటల్, స్థానిక సుప్రజ క్లినిక్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, దాసరి రమేష్ ప్రారంభించారు. చిన్నారులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు బ్లాసమ్స్ ఆస్పత్రి డాక్టర్లు సీహెచ్ జ్యోతి, కె.మహాలక్ష్మి వైద్య పరీక్షలు చేశారు. సుమారు 400 మంది వైద్య సేవలు పొందినట్టు నిర్వాహకులు తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యులు పులపర్తి బుజ్జి, ముత్యం నాని తదితరులు వైద్య శిబిరాన్ని సందర్శించారు.



మెగా వైద్య శిబిరంలో చిన్నారులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్